క్లుప్తంగా

ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ ఎన్‌టీకె నాయక్

కర్నూలు కల్చరల్: ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తుందని రాయలసీమ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకె నాయక్ తెలిపారు. నగరంలోని ప్రసూన న్యాయ కళాశాల ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జ్ వీసీ హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉన్న ఏకైక న్యాయ కళాశాల అయిన ప్రసూన కాలేజీ ఎంతో మంది ఉత్తమ న్యాయవాదులు, న్యామూర్తులు, ఏపీపీలను అందించిందని అన్నారు. గౌరవప్రదమైన న్యాయ వృత్తిలో ఎంతోమంది బాధితులకు న్యాయం చేయవచ్చని సూచించారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ శివాజీరావు మాట్లాడుతూ..న్యాయవాద వృత్తిలో రాణించాలంటే అంకిత భావంతో పాటు క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు.

ఉన్నత విద్యా మండలి జోక్యం తగ్గించాలి

కర్నూలు కల్చరల్: ఉన్నత విద్యా మండలి జోక్యం తగ్గించి ఆర్‌యూ స్వయం ప్రతిపత్తిని కాపాడాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రాయలసీమ యూనివర్సిటీ అవినీతిపై వచ్చిన ఫిర్యాదులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆర్‌యూ విద్యార్థుల అభివృద్ధి ఉన్నత విద్యా మండలికి నచ్చడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యా మండలి అధికారులు వారి పరిధి దాటి యూనివర్సిటీలో పెత్తనం కొనసాగించడానికి ప్రయత్నం చేయడం చాలా దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్‌పై సంబంధం లేనివారు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాజు, అమర్, గణేష్, ప్రదీప్, అశోక్, మనోహర్, ప్రతాప్, పరమేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి

కర్నూలు న్యూసిటీ: ప్రమాదవశాత్తు గుడిసెలో జరిగిన షార్ట్‌సర్క్యూట్ వల్ల రెండ్లు ఎద్దు మృతి చెందాయి. ఈ ఘటన నగరంలోని బుధవారపేటలో చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి రంగన్న అనే వ్యక్తి గుడిసెలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. క్రమంగా అవి వ్యాపించి గుడిసె మొత్తం కాలిపోయింది. ఈ ఘటనలో అందులో ఉన్న రెండు ఎద్దులు మృతి చెందాయి. ఆధారమైన ఎడ్లను కోల్పోయి బాధిత రైతు రంగన్న శోక సంద్రంలో మునిగిపోయాడు. విషయం తెలుసున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

మహానంది: మహానందిలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ కలెక్టర్ రాజకుమారి గణియాకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆహ్వాన పత్రిక అందించారు. శనివారం ఈఓ శ్రీనివాసరెడ్డి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌ను కలిసి ఆహ్వానించారు. మహానందిలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఈ నెల 18న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో రెండో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి ఈఓ తీసుకెళ్లారు.

మహానందిలో పెళ్లిసందడి

మహానంది: మహానందిలో శనివారం పెళ్లిళ్ల సందడి నెలకొంది. మాఘమాసం కావడంతో మంచి ముహూర్తాలు ఉండటంతో పలు ప్రాంతాల వధూవరులు మహానందీశ్వరుడి సన్నిధిలో వివాహాలు చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఓ వివాహానికి అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించారు.

యాగంటి ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రం ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. వేలం పాటలో ఐదుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొనగా పాతపాడు గ్రామానికి చెందిన మధుసూధాకర్ అత్యధికంగా రూ.11.65 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ వెల్లడించారు. వేలం పాట పర్యవేక్షణాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండిమౌలిశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నృత్య నీరాజనం



కూచిపూడి నృత్యం చేస్తున్న బాలికలు

సూర్య కళా కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో త్యాగరాజ సంగీత ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంగీత మూర్తి త్రయంగా పేరొందిన త్యాగరాజు, శ్యామ శాస్త్రి, ముత్తూట్ స్వామి దీక్షితులు ముగ్గురిలో మొదటి ఇద్దరు పూర్వ కర్నూలు జిల్లాకు చెందిన వారన్నారు. కళలు మన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడతాయన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. గీతాంజలి బృందం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు సోమ శంకరయ్య, డాక్టర రాధిక, నృత్య శిక్షకులు పాల్గొన్నారు. –కర్నూలు కల్చరల్

చిన్నారుల వ్యాధులపై అవగాహన పెరగాలి



అవగాహన కల్పిస్తున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు వచ్చేందుకు అవకాశమున్న క్యాన్సర్లు, వైకల్యాలపై తల్లిదండ్రులకు అవగాహన పెరగాలని చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ కమిటీ మెంబర్ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. శనివారం చైల్డ్ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లల్లో వచ్చే అంగవైకల్యాలు, క్యాన్సర్ తదితర వ్యాధులపై స్థానిక మార్కెట్‌యార్డు పరిసర ప్రాంతాల్లో ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు వచ్చే వాటిని చైల్డ్‌హుడ్ క్యాన్సర్ అంటారన్నారు. ఇవి పుట్టుకతోనే జన్యు లోపం లేదా వంశపారం పర్యంగా వస్తాయన్నారు. వాటిని తొలిదశలోనే గుర్తించగలిగితే పూర్తిగా నయం చేయగలిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. గాయాలైనప్పుడు ఆగని రక్తస్రావం, చర్మం, కళ్లు పాలిపోవడం, బరువు తగ్గడం, మూర్ఛ రావడం, గడ్డలు లాంటి కనిపించడం, ఆకలి తగ్గడం, కంటికి సంబంధించిన క్యాన్సర్‌ను తల్లిదండ్రులు గుర్తించగలిగితే సరైన సమయంలో పిల్లలకు వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఆర్ బుజ్జమ్మ, ఆశా వర్కర్ ఆర్ ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్ టి. రాధిక పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు పాటుపడాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యవర్గం

కర్నూలు న్యూసిటీ: దేశ ప్రగతికి అడ్డంకిగా మారిన అవినీతిని నిర్మూలించేందుకు యువత నడుంబిగించాలని యూత్ ఫర్ యాంటీ కరెప్షన్ స్టేట్ అడ్వైజర్ కొంకతి వేణుగోపాల్, బీసీ జన సభ అధ్యక్షుడు శేషఫణి, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కొనేటి శ్రీనివాసులు సూచించారు. నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని రాయలసీమ విద్యార్థి జేఏసీ కార్యాలయంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎవరైనా ఉద్యోగులు అవినీతికి పాల్పడితే సదరు ప్రభుత్వ సంస్థలపై ప్రజలో విశ్వాసం పోతుందన్నారు. ప్రతి ఒక్కరూ అవినీతిపై పోరాటం చేస్తూ దేశ ఉజ్వల భవిష్యత్తుకు పాటుపడాలని కోరారు

బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దాం

- మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అధికారులు సమన్వయంతో పనిచేసి, జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కాల్వబుగ్గ దేవస్థానంలో శివరాత్రి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆలయ ఈఓ మద్దిలేటి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, డీఎస్ఓ మంజునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తుల సంఖ్యకు అనుగుణంగా తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రవాణా సౌలభ్యం కోసం కర్నూలు నుంచి సాధారణ బస్సు సర్వీసులతో పాటు, అవసరాన్ని బట్టి అదనపు బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, భద్రతపై దృష్టి సారించాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో పార్కింగ్ ఏర్పాట్లు

- ఏపీ, టీజీ, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు ప్రత్యేకంగా బస్టాండ్
- పార్కింగ్ ప్రదేశాల్లో ప్రత్యేక వసతులు



శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. భక్తులు వేలాది వాహనాల్లో బ్రహ్మోత్సవాలకు తరలివస్తారు. వాహనాల పార్కింగ్ కోసం క్షేత్ర పరిధిలో మొత్తం 25 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్, వాసవి విహార్ పక్కన, ఆగమ పాఠశాల ఎదురుగా, ఆర్టీసీ బస్టాండ్ వెనుక, గణేశసదన్ ఎదురుగా, విభూతిమఠం పార్కింగ్ ఏరియా, ఫిల్టర్‌బెడ్, గణేశసదనం పక్కన, మల్లమ్మ కన్నీరు వద్ద, గురుసదన్ ఎదురుగా తదితర ప్రదేశాలలో మొత్తం 25 ఎకరాల్లో 5,050 వాహనాలు పార్కింగ్ చేసుకునే వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు ప్రాంగణాలను తీర్చిదిద్దారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెంట కూడా ప్రైవేట్ ఆర్టీసీ బస్సులు నిలుపుకునే వెసులుబాటు కల్పించారు. మొత్తం 13.80 ఎకరాల్లో 4,640 ఆర్టీసీ బస్సులు నిలుపుకోవచ్చు. కార్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్‌బస్సులు నిలుపుకునే ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించారు. అలాగే తాత్కాలిక టాయిలెట్స్, తాత్కాలిక వసతి పొందేందుకు షామియానాలు, స్నానమాచరించేందుకు అవసరమైన నీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన మేరకు విద్యుద్దీకరణ పనులు చేపట్టారు. ఆర్టీసీ బస్సు పార్కింగ్‌ల వద్ద సమాచార కేంద్రాలను, క్షేత్ర పరిధిలో ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్లాలో భక్తులకు తెలిసే విధంగా సూచికబోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

డోన్ టౌన్: లోక్ అదాలత్‌లో దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, న్యాయవాదులు, పోలీసులు చొరవ తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి అన్నారు. స్థానిక కోర్టు భవనంలో శనివారం సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, డోన్ కోర్టు న్యాయవాదులతో మార్చి 8వ తేదీ జరిగే లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ అయ్యే కేసులు ఉంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం ఉత్తమం అని తెలిపారు. ఈ విషయం కక్షిదారులకు తెలియజేసి అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, న్యాయవాదులు ఆలా శ్రీధర్, శేషశయశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. పట్టణ సమీపంలోని శ్యాంజో స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా విజయం సాధించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



ఆసుపత్రిలో చెత్త తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది



విద్యుత్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఈ ఉమాపతి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి పరిసరాలు బాగుంటేనే రోగుల ఆరోగ్యం కూడా బాగుంటుందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వచ్ఛ ఆసుపత్రి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రిని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, అడ్మిని స్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.

యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...

జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సత్య నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం అన్ని కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం నిర్వహించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ వెంకటస్వామి, అడిషనల్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు రోషన్న, సోమశేఖర్, సెట్కూరు సూపరింటెండెంట్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలోనూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ చెప్పారు. కార్యక్రమంలో ఏఓ అరుణ, డీఐఓ డాక్టర్ నాగ ప్రసాద్, డీపీఎంఓ ఉమా, సంచార వాహన చికిత్స జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

కర్నూలు(అర్బన్): జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులందరు ఉదయం నుంచే పలుగు, పార, చీపుర్లు పట్టి జెడ్పీ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అలాగే ప్రాంగణంలో ఎండి పోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటారు. స్థానిక సంక్షేమ భవన్‌లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని ఆ కార్యాలయ ఉద్యోగులు చీపుర్లు పట్టి ఊడ్చేశారు.

కర్నూలు న్యూసిటీ: నగరంలోని విద్యుత్ కార్యాలయాల్లో శనివారం శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆ శాఖ ఎస్ఈ ఉమాపతి విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట ఉద్యోగులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత కార్యాలయాల్లోని ఫైళ్లు శుభ్రం చేసి, ప్రాంగణాలలో చెత్తచెదారం తొలగించారు.

కర్నూలు కల్చరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగ చంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోని...ఆరోగ్యవంతంగా ఉండాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. శనివారం మాధవీనగర్‌లోని నారాయణ ఇంగ్లిష మీడియం స్కూల్‌లో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో పాణ్యం ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ స్కూల్ ఏజీఎం అన్వర్ బాషా, ప్రిన్సిపల్ మహమ్మద్ అల్తాఫ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు : జిల్లాలో పోలీస్ స్టేషన్లు, వాటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. స్వచ్ఛత దివస్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీస్ స్టేషన్లను పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి శుభ్రపరిచారు. ప్రతి ఒక్కరూ విధిగా తమ గృహాలను ఏ విధంగా అయితే శుభ్రంగా ఉంచుకుంటామో అలాగే కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లను ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు.

విన్నపం

బీసీ హాస్టల్‌ను పునః ప్రారంభించండి

కర్నూలు(అర్బన్): నగరంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు మూతకు గురైన ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాన్ని పునః ప్రారంభించాలని ఏపీ బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి. ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కె. వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రంతో పాటు మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల చిత్ర పటాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సమన్వయ లోపం కారణంగా జిల్లా కేంద్రంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని మూసి వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీ క్యాంప్‌లో ఉన్న బీసీ, డీఎన్‌టీ వసతి గృహాల్లో దాదాపు 600కు పైగా విద్యార్థులు వసతి పొందేవారన్నారు. ఎలాంటి ముందస్తు చర్యలు లేకుండా హాస్టళ్లను మూసి వేయడం వల్ల అనేక మంది విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే విద్యకు దూరమయ్యారన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన విభాగం నాయకులు రవిరాజ్ కూడా పాల్గొన్నారు.

స్పోర్ట్స్

17 న జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 17 నుంచి 20 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 2 వ జాతీ య స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలు ర హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి. శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదు జిల్లాలకు చెందిన క్రీడాకారులు జట్టులో ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 120 బాలుర జట్లు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నాయని వెల్లడించారు.

సంక్షిప్తం

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

కర్నూలు న్యూసిటీ : ఎన్నికల హామీ మేరకు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు మహేష్, బీసన్న డిమాండ్ చేశారు. మాజీ కార్పోరేటర్ గిడ్డమ్మ అధ్యక్షత జరిగిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. చాలా మంది ఎన్నికల హామీ అమలు కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

రేపటి నుంచి జి.పుల్లారెడ్డిలో విజ్ఞాన మేళా

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ 40వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17,18,19 తేదీల్లో మూడు రోజుల పాటు విజ్ఞాన మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కాలేజీ యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ మేళాకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 100కిపైగా వర్కింగ్ మోడల్ ప్రదర్శనలు రానున్నాయని, ఇందులో ప్రధానంగా సమాజానికి ఉపయోగపడేవి ఉంటాయని వెల్లడించింది.

సమస్యల పరిష్కారానికి కృషి

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన డాక్టర్ విద్యారెడ్డి కుటుంబ సభ్యులు కేజీ వెండి పాత్ర,రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

నులిపురుగులతో అనారోగ్యం



పోస్టర్ల ద్వారా నులిపురుగుల గురించి అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి రఘు

కర్నూలు(హాస్పిటల్): పిల్లలకు నులిపురుగులతో పలు అనారోగ్య సమస్యలొస్తాయని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. శనివారం నగరంలోని సి.క్యాంపు సెంటర్‌లో ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో నులిపురుగులపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు ఇచ్చామని, ఇంకా ఏదైనా కారణాలతో మాత్రలు తీసుకోని పిల్లలకు ఈ నెల 17వ తేదీన ఇస్తారన్నారు. ఈ మాత్రలు భోజనం తర్వాత చప్పరించి మింగాలన్నారు. కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, ఉడకని మాంసం తినడం ద్వారా ప్రేగుల్లో కొంకి పురుగులు, నులిపురుగులు, ఏలికపాములు చేరి అనారోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. దీనివల్ల బరువు తగ్గడం, కడుపులో నొప్పి, తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోవడం, మానసికంగా, శారీరకంగా అస్థిమితంగా ఉండటం, మలబద్ధకం, వికారం, వాంతులు, కడుపులో ఉబ్బరంగా ఉండటం, రాత్రి సరిగ్గా నిద్ర పట్టకపోవడం, రక్తహీనత, ఎదుగుదల లేకపోవడం, చర్మంపై దద్దుర్లు లాంటి లక్షణాలు ఉంటాయని, రోగనిరోధకశక్తి తక్కువగా ఉండే వారిలో తీవ్ర ఇబ్బందులు కలగజేస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ మహేష్, ఉపాధ్యాయులు ధనలక్ష్మి, డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కల్లూరు ఎస్టేట్, చెన్నమ్మ సర్కిల్‌లో ఏపీజీబీ దగ్గర న్యూసిటీ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూసిటీ నగర కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ.. మహిళల పొదుపు సంఘాల ఖాతాలు ఎక్కువగా ఏపీజీబీలోనే ఉన్నాయన్నారు. ఇతర జాతీయ బ్యాంకులకు సమానంగా సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో న్యూసిటీ నగర కార్యవర్గ సభ్యులు యేసు, నాయకులు లక్ష్మన్న, రాజు, దానమ్మ, జయరామ్, రమేష్ , రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రానికి స్థల పరిశీలన

కొత్తపల్లి: మండలంలోని శివపురం చెంచుగూడెంలో ఏర్పాటు చేయనున్న ఆరోగ్య ఉపకేంద్రానికి ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ ఉమారాణి శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్(పీవీటీజీ) మిషన్ నుంచి కన్జర్వేషన్ కమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీసీడీపీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్ సెంటర్‌కు రూ.55 లక్షలు మంజూరు చేసిందన్నారు. సబ్ సెంటర్‌కు కావలసిన స్థలాన్ని పరిశీలించామన్నారు. దాతలు ఎవరైనా ఉంటే చెంచుగూడెం సమీపంలో స్థలాన్ని ఇవ్వాలని కోరారు. అనంతరం శివపురం గ్రామ శివారులోని పెట్రోల్ బంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ఉన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెరగాలి



హుసేనాపురంలో సోక్ పిట్స్‌ను ప్రారంభిస్తున్న పీడీ

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెరగాలని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య సూచించారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామం వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లి కనీసం 4 గంటలు పనిచేసి దినసరి వేతనం రూ.300 పొందాలని సూచించారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలను కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అంతకు ముందు హుసేనాపురం గ్రామంలో సోక్ పిట్స్ పనులను ప్రారంభించారు. అనంతరం హుసేనాపురం, కాల్వ గ్రామాల్లో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ శ్రీనివాసులు, కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, సర్పంచ్‌లు చంద్ర గోవర్ధనమ్మ, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.